


# నేర్చుకో

## సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి

పేషెంట్ తాలూకు బంధువుతో ఓ అర్ధగంట ఘర్షణ పడి పిండవలసిన కాడికి పిండి జేబులో కుక్కుకుంటూ నా వైపు ఆలవోకగా చూసి ''నేర్చుకో'' అన్నాడు డాక్టర్ సుబ్బరాజు.

నేర్చుకొనేందుకే నేనక్కడ చేరాను.

అయితే నేర్చుకొనేదేమిటో నా కింకా పూర్తిగా అర్థం కాలేదు.

పది మందికి పెట్టేంత స్తోమత లేకున్నా చేతి సాయమన్నా చేద్దామనే తపన నాకు మొదట్నించీ వుంది.

ఇంటర్ పూర్తవగానే పై చదువులకు కుదరక బాగా ఆలోచించే నేనిక్కడ చేరాను. ఇందుకు నేనెంతో ఆనందపడ్డాను కూడా - దారిలోనే చావకుండా కనీసం టౌను వరకైనా మా పల్లె రోగుల్ని తీసుకెళ్లేందుకు నేను నేర్చుకొనే పని ఉపయోగపడుతుందని.

నా ఆరునెలల కాంపౌండర్ సర్వీసులో ఇప్పటికే చాలాసార్లు డాక్టర్ ఆ మాటన్నాడు కాని దానర్థం నాకింకా సరిగ్గా తెలీడం లేదు.

పేషెంట్ తెచ్చిన సూది మందును సిరంజికెక్కిస్తోంటే నా వైపు ఉరిమి చూసి బాటిల్‌ను లాక్కుని పక్కన పడేసి క్రితం పేషెంట్ తాలూకు మందు మిగిలిన బాటిల్ నాకిస్తూ ''నేర్చుకో'' అన్నాడు డాక్టర్ మొదటగా ఐదు నెలల క్రితం.

అందులో తిరకాసేదో నా కర్థం కాలేదు.

అవసరం లేనపుడు మందు తెప్పించుకొమ్మని చెప్పటమెందుకో మరి!

తర్వాత కలరా సీజన్‌లోననుకొంటా. నైట్ డ్యూటీ చేయాల్సి వచ్చినపుడు రోగుల బాధ చూడలేక తెల్లవార్లూ వాళ్ల బాగోగులు చూస్తూ మేలుకొని ఎర్రటి నిద్రమత్తు కళ్ళతో డాక్టర్ వద్ద కెళ్లినపుడు ''తెల్లార్లూ మేలుకున్నావా! మరీ అంత సెన్స్‌లెస్‌గా ప్రవర్తిస్తే ఎలా?... నేర్చుకో!'' అన్నపుడు కూడా ఆ మాటకు అర్థం తెలిసి చావలేదు.

నేర్చుకోవటమంటే నా దృష్టిలో రోగులకి సేవ చేయడం. కాని ఆ అర్థం నాకిక్కడ ఆయన మాటలో స్ఫురించట్లేదు.

కలరా సీజన్ ఆరంభంలో డాక్టర్ అనేవాడు- ''ఇంకా వెధవ వర్షాలు రాలేదోయ్ భాస్కర్!'' అని.

''వర్షాలు రాకుంటే మాలాంటి రైతులగ్గానీ - మీకేం ఇబ్బంది సార్?'' అని నేనంటే-

''అక్కడే నువ్వు పొరబడ్తున్నావ్. వర్షాలొస్తేనే గదా మన బిజినెస్ మూడు సెలైన్‌లు, ఆరు ఫీజులుగా రన్నయ్యేది. పూర్ ఫెలో నేర్చుకో!'' అన్నాడు.

వైద్యాన్ని బిజినెస్ అనటంలో గల మర్మం నాకప్పుడు సరిగ్గా అర్థం కాలేదు. తర్వాత పది రోజులకే బాగా స్పష్టంగా తెలిసి వచ్చింది.

'ఎండాకాలం నీళ్లమ్ముకొనే కూల్‌డ్రింక్ షాపులకీ, వర్షాకాలం నీళ్ల మందు అమ్ముకొనే ఆస్పత్రులకీ మించిన బిజినెస్ మరొకటి లే'దని మా మిత్రుడొకడు అనే మాటకి అర్థం ఇప్పుడు బాగా అవగాహనకొస్తోంది.

ఆ రోజు పది గంటల ప్రాంతంలో ఏడుపుల భుజాల మీదుగా ఓ పేషెంట్ వచ్చింది.

> మృత్యువు తన వొడిలోకి తీసుకుంటున్న మనిషిని, మళ్ళీ జీవితం వొడిలోకి చేర్చగలగడం నిజంగా ఎంత అద్భుతమైన పని! అందుకనే వైద్యుణ్ణి 'వైద్యోనారాయణో హరిః' అన్నది. అటువంటి వైద్యుడు, తాను హరి కావడానికి బదులు రోగి ప్రాణాలను 'హరీ' మనిపించడాన్ని ఏమనాలి? మనిషి ప్రాణం కన్నా డబ్బు కాగితాలు విలువైనవిగా భావించడం ఎంత అమానుషం?

వయస్సు అరవై ఏళ్లుంటాయి. అస్తి పంజరానికి నల్లటి చర్మపు తొడుగును వేసినట్టుగా వుంది. వాంతులు, బేదులకు కూడా ఓపిక లేని స్థితిలో వుంది.

మా డాక్టరు బాగా హడావిడి చేశాడు.

పేషెంట్ వచ్చిన ప్రతి మొదటి క్షణాల్లో ఇలాగే కల్లోల సముద్రదవుతాడు. చివరి క్షణాలు సమీపించే కొద్దీ ఎందుకో మరి ప్రవాహం సాగిపోగా అక్కడక్కడా గుంటల్లో మిగిలిన నీళ్ళలా నిర్వేదంగా వుంటాడు.

సెలైన్ బాటిల్ లోంచి ఒక్కో బొట్టు నిశ్శబ్దంగా హృదయంలో క్షణాన్ని లెక్కబెడుతూ రాల్తోంటే అక్కడి పరిస్థితి కొద్దిగా సద్దుమణిగింది.

పేషెంట్లను చెక్ చేసి డాక్టర్ మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్ళాడు.

ముసలామెకు సంబంధించిన మనుష్యులు మంచం పక్కనే నిల్చుని వున్నారు. ఒకామె కూతురు కాబోలు చాలా ఆందోళనగా వుంది. వాంతులు, బేదులతో తడిసిన ఆమె బట్టల్ని సరిజేస్తోంది.

మిగిలిన ఇద్దరు మగాళ్ళూ కొద్దిగా అటూ ఇటూ తప్పుకు తిరుగుతున్నారు. నిజం చెప్పాలంటే అసహ్యం ఫీలవుతున్నారు.

“నీకేం గావాలమ్మా యామె?” అడిగాను మంచం పక్కన నిల్చున్నామెతో

“మా యమ్మ సార్!” చెప్పింది. “నేనొక్కదాన్నే మా యమ్మకు. బో కట్టం జేసే ముసిల్ది. నిన్న గూడా గంపెడు గడ్డి దెచ్చింది. సందెదు కట్టెల్దెచ్చింది. రెక్కలు ముక్కలయ్యేట్టు పన్జేసి ఇన్నాల్లూ మమ్మల్ను సాకింది. వద్దే... సద్ది సంగటి తినొద్దే అంటే... పాసిపోయ్యిన సద్ది దాగింది. మా పానాల మీదికి దెచ్చింది.” అంది ముక్కు చీదుకుంటూ.

“పొద్దుగూకే వయసు సారూ! రోగాలూ రొట్టలూ రాకుండా యాడుంటయ్... ఏదో బతికితే ఇంటకాడ ఆ పనీ యాపనీ సేస్తావుంటదని తీస్కొచ్చినం” అన్నాడు ముసల్దాని అల్లుడు కాబోలు- చాలా తేలిగ్గా.

నాకు అసహ్యం కలిగింది అతని మీద. ‘మనుష్యుల మధ్య ఇంత తేలిక సంబంధాలుంటాయా’ అన్పించింది. జీవితాంతం వాళ్ల కోసం అవయవాల్ని అరగదీసికొన్న ముసలామె యీడు అవసరం లేనిదిగా కన్పిస్తోంది.

ఇదే రోగం - పని చేయలేని స్థితిలో ఆమెను త్రోయించి వుంటే, పరిస్థితి ఎలా వుండేదో మరి! హాస్పిటల్ అనేది ఒకటుందనే విషయం మెదడులో తట్టి వుండేది గాదేమో!

అర్థగంట తర్వాత అతనే మాట్లాడాడు “బాటిల్లు ఇంకా తేవాల్నా సారూ?” అని.

“ఏమో! అవసరపడొచ్చు. డాక్టర్ రావాలి గదా!” చెప్పాను.

“ఇంటికి బోవాల సారో!” అన్నాడు.

నాక్కోపం వచ్చింది. “ఇద్దరైనా పేషెంట్ వద్ద వుండకుంటే ఎలా?” అన్నాను.

వెంటనే అతను చెప్పాడు “సారూ! కూలికి బోతే కడుపు నిండాల. ముసల్దాన్ని యిడ్సి పోవాలంటే నాకూ నొప్పిగానే వుంది. అయితే... సచ్చేదాని కోసం నేనీడుంటే ఇంటి కాడ పిల్లోల్లు కూటికి సావరా సారూ? కడుపుకింత కూడైనా కావాలి గద్సారూ!” అని.

నాకు తల తిరిగి పోయింది. వాళ్ల బాధ బాగా అర్థమైంది. ఆర్థిక సమస్యల ముందు బంధుత్వాల బలమెంత?

వెల్తూ వెల్తూ కొంత డబ్బు భార్య చేతిలో పెట్టి వెళ్లాడతను.

ముసలామె పరిస్థితి ఆందోళనకరంగానే వుంది.

సాయంత్రం ఐదు గంటల వరకూ డాక్టర్ కూడా అవీ ఇవీ సజస్ట్ చేసి పెదవి విరిచాడు.

“చాలా సీరియస్ కేస్” అన్నాడు ముఖమంతా ఆ భావం ప్రతిఫలించేలా.

“ఈమె అనేమిక్ పేషెంట్. అందులోనే సివియర్ కలరా. రెండ్రోజులు ముదరబెట్టి తెచ్చారు. పాతకాలపు పిండమై బతకింది. ఇంకొకరై వుంటే ఇంటి వద్దే... ‘చావాల్సింది’ అన్నట్టుగా చేయి వూపుతూ పెదవి విరుపుతో మరో పేషెంట్ వద్దకు నడిచాడు.

బ్రద్దలయ్యేందుకు సిద్ధంగా వుంది ముసలామె కూతురు.

“మీ కాళ్ల బడతా సారో! మా యమ్మను బతికియ్యండి. ఈ ముండే మాకు పెద్ద దిక్కు సారో!” అంది డాక్టర్ కాళ్ళ మీద పడుతూ.

“మేముండేది బతికియ్యాలనే” అంటూ ఇంకో పేషెంట్ జబ్బలో సూది బలంగా దించుతూ “డబ్బుందా?” అడిగాడు.

ఎవర్నో అర్థం కాక ఆమె దిక్కులు చూస్తోంటే - “నిన్నే” అన్నాడు గట్టిగా.

“ఉంది సారూ!” చెప్పింది ఆమె.

“అయితే హెమాక్సిల్ అని మందు బాటలుంటది. రాసిస్తా. తెచ్చుకో” అంటూ సిరంజి లాగి నా కందిస్తూ తన సీటు వద్దకెళ్లాడు.

ప్రిస్క్రిప్షన్ రాసి ఆమె చేతిలో పెడుతోంటే అడిగింది “ఎంతయిద్ది సారూ?” అని భయం భయంగా.

“డెబ్బై ఐదు రూపాయిలు” చెప్పాడు.

ఆమె లబోదిబోమంది. “నా కాడ అంత లెక్కలేదు సారో. మా యింటాయన గూడా లేదు” అంటూ ఏడ్చింది.

“పిల్చుక రా పో” కోపంలో అసహ్యతను మిక్స్ చేసి గాండ్రించాడు.

ఆమె ఆదరా బాదరా బైటకెళ్లింది.

వాళ్ల బతుకుల మీద నాకు చాలా జాలేస్తోంది. తల్లి కోసం నిజంగా బాధపడుతోందామె.

పావు గంటలో భర్తను వెంటేసుకొచ్చింది.

అతన్ని చూడగానే డాక్టర్ మండి పడ్డాడు.

“నీ కసలు బుద్ధుందటయ్యా? ఇంత సీరియస్ కండిషన్లో కూడా నీలాంటి వాళ్లు యిలా అజాగ్రత్తగా ప్రవర్తించబట్టే మేమేం చేయలేక పోతున్నాం. మాకుండే శ్రద్ధలో పదో వంతన్నా మీకుండాలిగా! హాస్పిటల్లో తీసికొచ్చి పడేస్తే సరిపోతుందా? డాక్టరేమన్నా దేవుడనుకొన్నారా? బుద్ధుండాలయ్యా - బుద్ధి” అంటూ గట్టిగా మందలిస్తూ “ఆ చీటిలో బాటిల్ తెచ్చుకుంటావా? పేషెంట్ని ఇంటికి తీసికెళ్తావా?” అడిగాడు సీరియస్గా

అతను రెండు చేతులు ముకుళించి “దయజూపండి సారూ! కూలీ నాలీ జేసుకునేటోల్లం. ఈడికే మా ఆడదాని తాళిబొట్టు కుదువబడింది” ప్రాధేయపడ్డాడు.

“నీకు తెలిసిన వాళ్ళ వద్ద అప్పు తీసుకొని

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

ప్రటా పో'' డాక్టర్ గద్దించడంతో అతను బైటకు పరుగెత్తాడు.

ఆమె తల్లి మంచం వద్ద ఆరాటపడుతోంది. మంచం చుట్టూ తిరుగుతోంది. తల్లి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తోంది - లోతుల్లో దాగిన జీవ కళ సాక్షాత్కరిస్తుందేమోనని.

పావు గంటలో తిరిగి వచ్చాడు అతను - హెమాక్సిల్ బాటిల్‌తో.

అప్పటికే చీకటిపడింది. లో వోల్టేజి కారణంగా బల్బులు ఎర్రగా మినుకు మినుకుమంటున్నాయి.

బాటిల్ తీసుకొని కర్టన్ చాటు కెళ్ళాడు డాక్టర్.

''భాస్కర్......'' పిల్చాడు లోపల్నించి.

ఖాళీ అయిన సెలైన్ బాటిల్ తీసి మరో బాటిల్ తగిలించి డాక్టర్ వద్ద కెళ్లాను.

''కొద్దిగా మిగిలిన హెమాక్సిల్ బాటిల్ ఉండాలనుకొంటా -నిన్నటిది...'' నాకేసి చూస్తూ అడిగాడు.

''ఉంది సార్!'' చెప్పాను.

నాలో ఏదో ఆశ డాక్టర్‌గారు వాళ్ళకేమైనా సాయం చేయకపోతాడా? అని.

''తీసుకురా పో!''

స్టోర్ రూంలో కెళ్ళి నిన్నటి బాటిల్ గుర్తించి పట్టుకొచ్చాను. బాటిల్‌లో ఇంకొంత హెమాక్సిల్ ద్రావణం మిగిలి వుంది.

''కోడూరు పేషెంట్ పరిస్థితి ఎలా వుందో చూడు.'' బాటిల్ అందుకొంటూ అన్నాడు.

''ఇప్పుడే సెలైన్ మార్చాను సార్!''

''బ్రాలాజు పల్లె పేషెంట్...?''

నేను పేషెంట్ల కేసి కదిలాను. ఒక్కొక్కర్నీ చెక్ జేసుకొంటూ వచ్చేసరికి డాక్టర్ హెమాక్సిల్ బాటిల్‌లో ముసలామె మంచం వద్ద కొచ్చాడు.

బాటిల్ స్టాండుకు తగిలించి నీడిల్ ఆమె చేతి నరానికి గుచ్చుతూ ''ఇందులో మూడు ఇంజక్షన్లు కూడా ఎక్కించాను. బాటిల్ పూర్తయ్యేసరికి ఖచ్చితంగా కోలుకోవాలి'' అన్నాడు.

రోగులందర్నీ ఒకసారి చెక్ చేసి ఇంటి కెళ్ళాడు.

రోగుల తాలూకు బంధువులు టిఫిన్ కారియర్లలో గుడ్డ మూటల్లో తెచ్చుకొన్న అన్నాన్ని భోం చేసేందుకు ఉపక్రమించారు.

కొందరు - రోగులకి బ్రెడ్డూ, పళ్ళూ లాంటివి తినిపిస్తున్నారు.

బల్బులు ఒక్కసారిగా పూర్తి జీవం పుంజుకొన్నాయి.

నేనూ కర్టెన్ చాటుకెళ్ళి నాలుగు మెతుకులు తిని బైట కొచ్చేసరికి ముసలావిడ మంచం వద్ద ఆవిడ కూతురు ఆరాటపడుతూ కన్పించింది.

''నా కేందో బయమేస్తా వుంది సారో!'' అంది పైట చెరను నోట్లో కుక్కుకొంటూ.

నేను మంచం దగ్గరగా వెళ్ళి నిల్చున్నాను.

ముసలామె ముఖంలో చైతన్యం ఓల్టేజి తగ్గిన బల్బులా క్రమంగా బలహీనమవుతోంది. పల్స్ కూడా వీక్ అయినాయి. ఊపిరి నెమ్మదిగా ఆడుతోంది.ఆమెలోంచి ఏదో జారిపోయే స్థితి.

నాకు కంగారేసి డాక్టర్ ఇంటి వద్ద కెళ్ళాను.

''ఏం భాస్కర్?'' అడిగాడు నన్ను చూడగనే డాక్టర్'' ఎనీ సీరియస్?'' నేను చెప్పాను.

డాక్టర్ తాపీగా వూపిరి వదిలేశాడు.'' అది నాకు ముందే తెలుసు ఆఖరి ప్రయత్నం చేశాను... ఐయామ్ సారీ... ఆమె బతకదు - నువ్వేం బాధపడాల్సిన పన్లేదు. ఇంటి దగ్గరే సీరియస్ కండిషన్... మనమేం చేద్దాం చెప్పు? ఆమె చనిపోవచ్చు. వాళ్ళ బంధువుల్ని తీసికెళ్ళమని చెప్పు. ఎవ్వరినీ ఏడవ నీయొద్దు - హాస్పిటల్‌కి చెడ్డ పేరు.'' అన్నాడు.

నేను హాస్పిటల్‌కు వెళ్ళాను.

ఇంకా పాతిక భాగం మందు వుంది బాటిల్‌లో. ముసలామె ప్రాణాలు జారిపోయే స్థితిలో వున్నాయి.

డాక్టర్ గారి చివరి సందేశం చెప్పాను.

తర్వాత పది నిమిషాలకే ముసలామె చివరి శ్వాస వదిలింది.

కొద్దిపాటి రోదనల వెనక శవం బైటకు కదిలింది.

నేను పడుకున్నాను గాని నిద్ర రావట్లేదు.

వాళ్ల బీదతనమే కళ్ల ముందు మెదల్తోంది.

ముసలామె గాజు కళ్ళ నిశ్చలత్వమే కంటి రెటీనా మీద దృశ్యాలుగా అలుముకోంటోంది.

లేచి ఆమె మంచం వద్ద స్టాండుకున్న బాటిల్ తీశాను - స్టోర్ రూంలో వేద్దామని.

నాకేదో అసహజత్వం తోచింది బాటిల్. చేతిలోకి తీసికోగానే చాలా పల్చటి రంగు ఇందాకా నిశిత దృష్టితో చూడలేదు.

రంగు వెలిసిన ద్రావణంలా......

మందులు ఎక్కించానన్నాడు. అయినా రంగు మారదుగా?

నాలో అనుమానం వేరు పురుగైంది. కర్టెన్ల వెనక టేబుళ్ళ మీద వెదికాను. స్టోర్ రూంలో వెదికాను. ఉహూ... నా సందేహానికి సాక్ష్యం దొరక లేదు... బీరువా బీగాలు నా వద్ద లేవు.

తెల్లవార్లూ అనుమానం నన్ను పురుగులా తొలుస్తూనే వుంది.

ఉదయం పది గంటల ప్రాంతంలో...

హెమాక్సిల్ బాటిల్ నాచేతికిచ్చి ''హైమ మెడికల్స్ వాళ్ళకిచ్చిరా. నేనిచ్చానని చెప్పు'' అని డాక్టర్ అన్నప్పుడు నాకు ఒళ్ళంతా కంపరమెత్తింది.

''ఇది... రాత్రి ముసలామెకు......'' నేను పూర్తి చేయబోయే లోపలే ''అవును... వెళ్ళి ఇచ్చిరా'' అన్నాడు.

డాక్టర్ మీద నాకు నరనరాల్లో అసహ్యం పెల్లుబికి వస్తోంది.

''అంత బీద వాళ్ళ వద్ద యీ పనిచేయటం బాగలేదు సార్! కొద్దిగా మిగిలిన మొన్నటి హెమాక్సిల్‌లో డిస్టిల్డ్ వాటర్ కలిపి ఆమెకు ఎక్కించినట్లున్నారు. అందుకే చచ్చింది. మీరు యీబాటిలే ఎక్కించి వుంటే బతికుండేదేమో!'' అన్నాను.

''డోంటాక్ ఫూలిష్‌లా'' గర్జించాడు!'' అంత సీరియస్ కండిషన్లో వుండే ఏజ్డ్ పేషెంట్ బతకడం ఎక్కడైనా చూశావా! చావటం ష్యూర్. ఏదో మన ప్రయత్నం మనం చేయాలి గాబట్టే యీ వైద్యమంతా''

''అలాంటప్పుడు మీరు అనవసరంగా కూటికి కూడా గతి లేని బీద వాళ్ళ చేత తాళి అమ్మించి బాటిల్ తెప్పించటమెందుకు?'' నాలో ఆవేశం పొంగుతోంది.

డాక్టర్ నాకేసి పిచ్చి వాణ్ణి చూసినట్టు చూశారు.

''ఆమె చస్తుంది. ఫీజెవడిస్తాడు? నువ్విస్తావా? ఇలాంటి కేసుల్ని నా సర్వీసులో ఎన్నో చూశాను. వాళ్ళ వద్ద ఫీజు రాబట్టాలంటే ఇంతకన్నా గత్యంతరం లేదు. ఫూలిష్‌గా ప్రవర్తించకు చూసి నేర్చుకో'' అన్నాడు.

నాకు అసహ్యంతో బాటు కోపం కూడా పెరిగింది.

''ఛీ! నేను మీ వద్ద వైద్యం నేర్చుకొందామని వచ్చాను గానీ - శవాలతో వ్యాపారం చేసేందుకు క్కాదు. ఇది నేర్చుకోవటం కన్నా వీథుల్లో అడుక్కోవటం మేలు'' గట్టిగా అంటూ బాటిల్‌ని నేలకేసి విసిరి విస విస బైటకు నడిచాను.

పగిలిన బాటిల్ శబ్దం నా చెవుల్లో భల్లుమంది.

పేషెంట్ల తాలూకు బంధువులు వింతగా నాకేసి చూడటం కంటి చివర్లోంచి స్ఫురిస్తూనే వుంది. ●

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్